విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 27, అక్టోబరు 2025

చెక్ పోస్టులు ఎత్తివేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య

విశాలాంధ్ర - బనగానపల్లె : కూటమి ప్రభుత్వం పెంచిన రాయల్టీ జీవోను వెంటనే రద్దుచేసి కష్టాలు నడుస్తున్న మైనింగ్ పరిశ్రమను ఆదుకోవాలని నంద్యాల జిల్లా సీపీఐ కార్యదర్శి రంగనాయుడు, నంద్యాల జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి సుంకయ్య, కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నాడు స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ, ఏఐటీయూసీ కార్యకర్తలు వందలాదిగా ర్యాలీగా బయలుదేరి పెట్రోల్ బంక్ సర్కిల్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా సీపీఐ కార్యదర్శి రంగనాయుడు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, నంద్యాల జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి సుంకయ్య, మాట్లాడుతూ ఒక రోజుకు 650 రూపాయలు రాయల్టీ వసూలు చేస్తుండగా కూటమి ప్రభుత్వం ప్రైవేట్ సంస్థ అయినటువంటి సుధాకర్ ఇన్ఫ్రా స్ట్రక్చర్‌కు రాయల్టీ వసూలు చేసేందుకు పర్మిషన్ ఇవ్వడం జరిగిందని ఆ సంస్థ నేడు ఐదు కిలోమీటర్లకు ఒక చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి ప్రతి ట్రాక్టర్ కు 2250 రాయల్టీ వసూలు చేయడం నష్టాల్లో ఉన్న మైనింగ్ పరిశ్రమ పూర్తిగా కుదేలైంది అన్నారు. దీంతో మైనింగ్ పరిశ్రమ యాజమానులు ,మైనింగ్ పరిశ్రమను మూత వేయడంతో ఈ పరిశ్రమ మీద ఆధారపడి ఉన్న మైనింగ్ యాజమానులు, మైనింగ్ కూలీలు, ట్రాక్టర్, లారీల యాజమానులు వారి ఉపాధి కోల్పోతున్నారు అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాయల్టీ అంశం మీద రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి నిరాహార దీక్ష చేయడని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాయల్టీని పూర్తిగా ఎత్తివేస్తామని నాడు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. మరి నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాయల్టీ తీసివేయాల్సింది పోయి పెంచడం పూర్తిగా అన్యాయం అన్నారు. అంతేకాక మైనింగ్ పరిశ్రమలకు కరెంటు బిల్లులు పెంచడంతో మైనింగ్ పరిశ్రమ పెరిగిన కరెంటు బిల్లులు చెల్లించలేక, రాయల్టీ చెల్లించలేక మరి నేడు మైనింగ్ పరిశ్రమలు మూత వేసే పరిస్థితి వచ్చిందన్నారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వెంటనే స్పందించి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి రాయల్టీ జీవను రద్దు చేయాలన్నారు. లేకుంటే సీపీఐ ,ఏఐటీయూసీ తరపున రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు రాస్తారోకోలు నిర్వహిస్తామని మైనింగ్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సీపీఐ మండల కార్యదర్శి శివయ్య, జిల్లా సమితి సభ్యులు సంజీవులు, ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ శివ బాలకృష్ణ, బేతంచెర్ల సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, ప్యాపిలి సీపీఐ మండల కార్యదర్శి మహేష్, అవుకు సీపీఐ కార్యదర్శి నాగ ఆంజనేయులు, ఏఐటీయూసీ బనగానపల్లె కార్యదర్శి కుల్లాయి స్వామి అధ్యక్షులు సుబ్బయ్య, సీపీఐ కమిటీ సభ్యులు కమిటీ సభ్యులు ఖాదర్, కొలిమిగుండ్ల ఏఐటీయూసీ కార్యదర్శి మహేష్ ట్రాక్టర్ యజమానులు గని యజమానులు గని కార్మికులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య రాక

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని బెలుం గుహలనందు సీపీఐ నంద్యాల జిల్లా కౌన్సిల్ సభ్యుల సైద్ధాంతిక రాజకీయ శిక్షణా తరగతులకు ప్రారంభం రోజు 27వ తేదీన సీపీఐ రాష్ట్ర నూతన కార్యదర్శి జి.ఈశ్వరయ్య ముఖ్యఅతిథిగా హాజరవుతారని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు తెలిపారు. 27 నుండి 29వ తేదీ వరకు మూడు రోజులపాటు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఆదివారం బెలుం గుహల నందు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, మండల రైతు సంఘం కార్యదర్శి పుల్లయ్యలతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర నూతన కార్యదర్శిగా ఈశ్వరయ్య బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా నంద్యాల జిల్లాలో జరుగుతున్న రాజకీయ శిక్షణ తరగతులకు హాజరవుతున్నారని సభ్యులందరూ తరలి రావాలన్నారు. 27వ తేదీన ఉదయం 11 గంటలకు కామ్రేడ్ కె.రామాంజనేయులు జెండా ఆవిష్కరణ చేస్తారని,11.30 గం శిక్షణ తరగతులను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కామ్రేడ్ పి.రామచంద్రయ్య ప్రారంభిస్తారని తెలిపారు.12.00గం రాయలసీమ సమగ్రాభివృద్ధి - నీటి ప్రాజెక్టుల నిర్మాణం పై టి లక్ష్మీనారాయణ, మధ్యాహ్నం 3.00 గంటలకు సీపీఐ రాష్ట్ర నూతన కార్యదర్శి జి.ఈశ్వరయ్య అభినందన సభ,4.00గం సీపీఐ జాతీయ రాష్ట్ర మహాసభల కర్తవ్యాలు తీర్మానాలు గురించి నూతన కార్యదర్శి జి.ఈశ్వరయ్య సందేశాలు ఇస్తారని తెలిపారు. జిల్లా సమితి సభ్యులు మండల కార్యదర్శులు తప్పనిసరిగా ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు.

శ్రీశైలం నంద్యాల జిల్లాలోనే కొనసాగాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రాయలసీమ ఆత్మగౌరవానికి భంగం కలిగించవద్దని, శ్రీశైలం నంద్యాల జిల్లాలోనే కొనసాగాలని రాయలసీమ సాగునీటి సాధనా సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి పేర్కొన్నారు. శ్రీశైలం రాయలసీమకు ఆధ్యాత్మికంగా, ప్రకృతిపరంగా, విజ్ఞానశాస్త్రపరంగా అత్యంత ప్రాధాన్యమైన ప్రదేశమని బొజ్జా పేర్కొన్నారు. 12 జ్యోతిర్లింగాలలో ఒకరైన శ్రీశైలం మల్లికార్జునుడు, 18 మహాశక్తి పీఠాలలో ఒకరైన భ్రమరాంబికాదేవి ఒకే సన్నిధిలో వెలసిన ఏకైక క్షేత్రం శ్రీశైలం పుణ్యక్షేత్రమని ఆయన వివరించారు. ఆధ్యాత్మిక వికాసానికే కాకుండా, మానసిక ఉల్లాసాన్నిచ్చే ప్రకృతి సంపదలతో రాయలసీమకు శ్రీశైలం ఆధ్యాత్మిక, ధ్యాన, మానసికానంద కేంద్రంగా విరాజిల్లుతుందని తెలిపారు. ఇదే ప్రాంతంలో కృష్ణమ్మ ప్రవాహాన్ని నియంత్రించి రాయలసీమ ప్రజల దాహార్తిని తీర్చడానికి, పంటలను పండించడానికి శాస్త్ర విజ్ఞానంతో రూపుదిద్దుకున్న శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం గురించి ఆయన వివరించారు. 60 వేల ఎకరాల భూమిని రాయలసీమ ప్రజలు త్యాగంతో నిర్మించారన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రాయలసీమ ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని అత్యంత బాధ్యతగా తీసుకొని, శ్రీశైలం రాయలసీమలోని నంద్యాల జిల్లా పరిపాలనా పరిధిలోనే కొనసాగేలాగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం జయప్రదం చేయండి

విశాలాంధ్ర - బనగానపల్లె: ఈ నెల 31వ తేదీన ఏఐటీయూసీ 106 వ్యవస్థాపక దినోత్సవం జయప్రదం చేయాలని నంద్యాల జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి సుంకయ్య పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి కులాయి స్వామి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నంద్యాల జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి సుంకయ్య, నంద్యాల జిల్లా ఆర్గనైజేషన్ సెక్రెటరీ శివ బాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సుంకయ్య మాట్లాడుతూ నంద్యాల జిల్లా వ్యాప్తంగా నియోజవర్గ కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో ఏఐటియుసి వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ భారతదేశంలో స్వాతంత్రం ముందు తర్వాత కార్మికుల హక్కుల కోసం పోరాడిన ఏకైక పార్టీ ఏఐటీయూసీ అన్నారు. కార్మికుల కోసం 44 కార్మిక సంక్షేమచట్టాలను సాధించిన ఘన చరిత్ర ఏఐటీయూసీ కలదు అన్నారు. కేంద్రంలో గల నరేంద్ర మోడీ ప్రభుత్వం 44కార్మిక సంక్షేమ చట్టాలను 4కోడ్స్ తీసుకువచ్చి కార్మికుల సంక్షేమానికి హాని కలగజేస్తుందన్నారు. 8 గంటల కార్మికుల పని విధానం నేడు 13 గంటలకు మార్పు చేస్తుందన్నారు. కనీసం కార్మికుల కనీస వేతనాలు కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వడం లేదన్నారు. కార్మికులు ఐక్యంగా 106 ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు.బనగానపల్లె ఏఐటీయూసీ మండల ప్రెసిడెంట్ సుబ్బయ్య, కొలిమిగుండ్ల ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు మహేష్ , నాగాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఉద్యోగుల సమస్యలపై పూర్తి అవగాహనతో పనిచేస్తున్న ఏకైక సంఘం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘమేనని రాష్ట్ర పరిశీలకులు సుదర్శన్‌రెడ్డి, హనుమంతు పేర్కొన్నారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి కార్యవర్గ సభ్యుడు సంఘం బలోపేతానికి కృషి చేయాలని, సభ్యత్వ పెంపుపై దృష్టి సారించాలన్నారు. సంఘం కోసం నిజాయితీగా కృషి చేసే వారిని రాష్ట్ర నాయకత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప మాట్లాడుతూ రాష్ట్రాధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ మార్గదర్శకత్వంలో ఉద్యోగుల శ్రేయస్సు కోసం సంఘం కృషి చేస్తోందని, "రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం" కార్యక్రమం ద్వారా ఉద్యోగుల సమస్యలపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, రాష్ట్ర ఎన్ఎంఆర్ టైమ్‌స్కేల్ అధ్యక్షుడు సురేష్, వేణుగోపాల్‌రెడ్డి, యశ్వంత్, విజయలక్ష్మి, చక్రధర్, చెంచమ్మ, యేసురత్నం, మహిళా సిటీ అధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ,సంఘం ప్రతినిధులు కోటేశ్వరరావు, బుల్లెట్ బాష, చక్రపాణి గౌడ్, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

బస్సు జాతను జయప్రదం చేయండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు యాత్ర నంద్యాల జిల్లాకు నవంబర్ నెలలో వస్తున్న సందర్భంగా నవంబర్ 8న నంద్యాల పట్టణంలో నిర్వహిస్తున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని నంద్యాల సీపీఐ కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎర్రిస్వామి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు,ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు మురళీధర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్య ప్రతాప్, ఎస్టియు జిల్లా అధ్యక్షులు ఆజాం బేగం,యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రసాద్, ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి రాంబాబు,వైకాపా నాయకులు సాయిరామ్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, వివేకానంద రెడ్డి, ఎస్డిపిఐ మజీద్ ఖాన్, పెన్షన్ల సంఘం నాగశేషుడు,ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొని ఎఐఎస్ఎఫ్ చేస్తున్న బస్సు యాత్రకు మద్దతిచ్చారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ ప్రవీణ్, చంద్రశేఖర్ నాయక్, చందు, జిల్లా నాయకులు మతేష్, అస్లాం, అక్రమ్,ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను పరిష్క రించాలని, కూటమి ప్రభుత్వం తీసుకొని వచ్చిన పిపిపి ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఇచ్చాపురంలో ప్రారంభమై నవంబర్ 12న అనంతపురంలో ముగింపు సభ నిర్వహిస్తున్నామని, నంద్యాల జిల్లాకు నవంబర్‌లో ప్రవేశమై నంద్యాల, బనగానపల్లె, డోన్ ప్రాంతం మీదుగా విద్యార్థుల చైతన్య బహిరంగ సభలను నిర్వహించుకొని అనంతరం కర్నూలు జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు.

పేదల డాక్టర్.. ప్రజా సేవకు విరామం

51 సంవత్సరాలు వైద్య సేవలు అందించిన డాక్టర్ రామిరెడ్డి

వీడ్కోలు పలికిన పట్టణ ప్రజలు ..

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: కోవెలకుంట్ల ప్రాంత ప్రజలకు 51 సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తూ ప్రజల్లో తనకంటూ ఓ చెరగని ముద్ర వేసుకున్న ప్రముఖ వైద్యులు రామిరెడ్డి వైద్య సేవల నుండి నిష్క్రమించనున్నారు. సంజామల మండలం కమలాపురి గ్రామానికి చెందిన రామిరెడ్డి కర్నూల్ మెడికల్ కాలేజీలో వైద్య విద్య అభ్యసించి అనంతరం 1974లో పట్టణంలో సంతపేట లో తన వైద్య సేవలు ప్రారంభించారు. అప్పట్లో రెండు రూపాయలకే ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ రెండు రూపాయల డాక్టర్ గా పేరు గడించారు. ఒకవైపు వైద్యులుగా తన ప్రాక్టీస్ కొనసాగిస్తూనే అనేక ప్రజా సేవ కార్యక్రమాలు కొనసాగించారు. పేదలకు వైద్యం చేస్తూనే పేద కుటుంబాలకు చెందిన యువతుల వివాహాలకు ఆర్థిక సహాయం అందిస్తూ వచ్చారు. అంతేగాక ఎంతో మంది పేద విద్యార్థులకు చదువులకు చేయూతనందించారు. కోవెలకుంట్ల పట్టణ శివారులోని కుందూ నది వద్ద పార్కు అభివృద్ధికి 15 లక్షల విరాళం ఇచ్చి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలో ఎన్నో సంవత్సరాలుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కోసం ప్రజా సంఘాలు డాక్టర్‌ను సంప్రదించగా తన సొంత నిధులతో అంబేద్కర్ విగ్రహాన్ని తయారు చేయించి నెలకొల్పారు. ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూనే ప్రజలకు అందుబాటులో ఉండి నిత్యం వైద్య సేవలు అందించేవారు. రామిరెడ్డికి శిరీష ,నీలిమ అనే ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మీరు కూడా వైద్యులు వృత్తిలో స్థిరపడ్డారు.80 సంవత్సరాలు పై పడటంతో రామిరెడ్డి వైద్య వృత్తి నుండి విరామం తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఇంతకాలం ఆయన ప్రజలకు అందించిన సేవలు పట్ల ప్రజాసంఘాల నాయకులతో పాటు ,పట్టణ ప్రముఖులు, ప్రజలు డాక్టర్‌ని అభినందించారు.

తెలుగు గంగ కాల్వ గండి పరిశీలన

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని డి వనిపెంట గ్రామ సమీపంలో అధిక వర్షాల వలన 84వ కి.మీ వద్ద తెలుగు గంగ కాలువకు గండిపడిన విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి ఆదివారం అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన చుట్టుపక్కల గ్రామ ప్రజలు, టీడీపీ నాయకులతో చర్చించారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడుతూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాబోవు రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు ఉన్నట్లు ప్రభుత్వం తెలియజేయడం జరిగిందని మంతా తుఫాను ఎక్కువగా ఉన్నట్లు సమాచారం ఉండడంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఈ వినయ్‌కుమార్,జేఈ రాంప్రసాద్, టీడీపీ నాయకులు గోపాల్,సురేష్,శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గండి పూడ్చేందుకు చర్యలు..

గండి పడి నీరంతా దిగువ ప్రాంతానికి అధికంగా వెలుతుండడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. తెలుగు గంగ ఎస్ఈ ప్రతాప్, ఈఈ మురళీకృష్ణ, శివశంకర్, డీఈలు రమణ, రత్నరాజు, గురుమూర్తి, ఏఈలు వినయ్. మోహన్ క్రిష్టారెడ్డిలు గండి పడిన ప్రదేశాన్ని ఆదివారం ఉదయం పరిశీలించారు. ప్రధాన కాలువ కొద్దిమేర కుంగి గండి పడిందని వెంటనే గండి పూడ్చేందుకు చర్యలు చేపట్టామని వారు వివరించారు. కొద్దిపాటి గండి పడిన ప్రదేశంలో ఇసుకబస్తాలను వేసి, మట్టిపోసి గండిని పూడ్చడం జరిగిందని అధికారులు వివరించారు. కార్యక్రమంలో తెలుగు గంగ డిస్ట్రిబ్యూ టరీ చైర్మన్ శగ్నారెడ్డి, రమణారెడ్డిలు పాల్గొన్నారు.

కొత్తూరు సుబ్బరాయునికి వెండి వస్తువులు వితరణ

విశాలాంధ్ర - పాణ్యం : ప్రముఖశైవక్షేత్రం మండల పరిధిలోని ఎస్ కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మూడు కేజీల 244 గ్రాముల వెండి వస్తువులు వితరణ చేసినట్లు ఆలయ ఈవో రామకృష్ణ తెలిపారు. కార్తిక మాసం ఆదివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారి దర్శనానికి రావడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బండి ఆత్మకూరు మండలం పార్నపల్లి గ్రామానికి చెందిన దేరెడ్డి నాగిరెడ్డి నాగ మునీశ్వర్ రెడ్డి వారి కుటుంబ సభ్యుల స్వామి వారు ఇంటి ఇలవేల్పు కావడంతో మొక్కుబడిగా సుమారు ఐదు లక్షల రూపాయలు విలువ చేసే మూడు కేజీల 244 గ్రాముల వెండి బిందె,వెండి పళ్ళెం,వెండి చెంబు మూడు వస్తువులు విరాళంగా ఇవ్వడం జరిగిందన్నారు.దాతలకు ఆలయ మర్యాదలతో అభిషేకంలు,అర్చనలు,విశేష పూజలు నిర్వహించి,పూలమాల శాలువాతో సత్కరించడం జరిగింది. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నారాయణస్వామి, ట్రైనింగ్ ఎస్సై ధనుంజయ, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి,నాగేశ్వరరావు,గ్రామ పెద్దలు మిలటరీ సుబ్బారెడ్డి,దాత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఈనెల 27వ తేదీ అనగా సోమవారం ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి కళ్యాణ మండపంలో డి.ఎస్.పి ప్రమోద్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. రెడ్ క్రాస్ సొసైటీ, ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి పోలీసు ఉన్నతాధికారులు, గౌరవ అతిధులు పాల్గొననున్నారు.

పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటి ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో నిర్వహించిన 61వ మెగా వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. కోవెలకుంట్ల తాలూకా సంజామల మండలం మంగపల్లె గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంకు శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి మౌలాలిరెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్యాన్ని అందించేందుకే పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, పెద్దిరెడ్డి ట్రస్ట్ తరఫున ప్రజా వైద్యశాలను నిర్మించి అక్కడ పేదలకు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉచిత వైద్య శిబిరంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి తమ సొంత ఖర్చులతో ఉచితంగా భోజన వసతిని కల్పిస్తూ మంగపల్లె గ్రామంలోని ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్నట్లు తెలిపారు. మెగా వైద్య శిబిరంలో 1200 మంది రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు.గుండె జబ్బులు,బిపి,షుగరు,మోకాళ్ళ నొప్పులు,కంటివ్యా దులు, ఊపిరితిత్తుల వ్యాధులు, స్త్రీలకు సంబందించిన వ్యాదులు,చెవి,ముక్కు, గొంతుకు సంబంధించిన జబ్బులకు,దంత వ్యాదులు,చర్మవ్యాదులకు వైద్యసేవలుచేసి మందులను ఇస్తున్నామన్నారు.

పాములపాడులో కార్డన్ సెర్చ్

విశాలాంధ్ర -పాములపాడు : జిల్లా ఎస్పీ సునీల్ షేరాన్ ఆదేశాల మేరకు ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్ సూచనలతో ఎస్ఐ సురేష్ బాబు , సిబ్బంది ఆధ్వర్యంలో పాములపాడు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున నేరనివారణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కార్డెన్ అండ్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పాములపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాలను నివారించడమే లక్ష్యంగా మరియు గ్రామాలలో ఎలాంటి గొడవలు అల్లర్లు జరగకుండా నివారించుటకు పోలీసులు ప్రజల కొరకు ఉన్నారనే భరోసా కల్పించడం కొరకు ఈ కార్డెన్ అండ్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సెర్చ్ ఆపరేషన్‌లో పోలీస్ అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి గ్రామంలోని అనుమాని తులు,నేర చరిత్ర గల వారి ఇళ్లలో సోదాలు నిర్వహించి అక్రమ మద్యం కలిగి ఉన్న చింతకుంట బాలయ్యను అరెస్ట్ చేసి, 25 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. సరైన ధ్రువపత్రాలు లేని 10 మోటార్ సైకిల్‌లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. గ్రామసభలో ప్రజలకు అవగాహన కలిగిస్తూ రోడ్డు భద్రతకు సంబంధించి హెల్మెట్ ధరించనిచో జరిగే ప్రమాదములు ,ఆటోలలో ప్యాసెంజర్స్‌ను ఓవర్ లోడ్‌గా ఎక్కించుకొనుట వలన కలుగు ప్రమాదములు, ఓవర్ స్పీడ్, డ్రైవింగ్ లైసెన్స్,వాహనము యొక్క ఆర్‌సి ,ఇన్సూరెన్స్ యొక్క ప్రాధాన్యత, డయల్ యువర్ 100 కాల్ యొక్క ప్రాధాన్యత గురించి,తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఏవరైనా చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని,పోలీసు అధికారులు హెచ్చరించారు. ఈ ఆపరేషన్‌లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పిఎంజెవికె భవనాలు,ప్రభుత్వ ఉర్దూ కాలేజ్, సద్భావన భవన్ త్వరితగతిన పూర్తి చేయాలని, నందమూరినగర్‌లో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఆల్మేవ నాయకులు కోరారు. ఆదివారం ఆల్మేవ ఏపి, నంద్యాల జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సమావేశం గౌరవాధ్యక్షులు ఎస్ఎండి అబులైస్, రాష్ట్ర అధ్యక్షులు ఇమ్రాన్ పాషాల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఆల్మేవ, ఏపీ అన్ని మైనారిటీ వర్గాల ఐక్యమత్యానికి, హక్కుల సాధనకు కృషి చేయడమే కాకుండా ఎన్నో రకాల వెల్ఫేర్ యాక్టివిటీస్‌ని నిర్వహిస్తూ వస్తుందన్నారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్ నబిరసూల్ మాట్లాడుతూ పిఎంజెవికే క్రింద ఆరు భవన సముదాయాలు మంజూరు కావడం వాటిలో నాలుగు భవన సముదాయాల నిర్మాణం 80 శాతం పూర్తి కావడం ఎంతో సంతోషించదగ్గ విషయమని, మిగిలిన రెండు భవనాలు నిర్మాణానికి నోచుకోలేదని వాటి నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని కోరారు. నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సలీం మాట్లాడుతూ పీఎంజీవీకే కింద కమ్యూనిటీ హాల్, ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల భవన నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్ మహమ్మద్ ఖాసిం, హాఫీజ్ షోయబుజ్జమ, మాలిక్ బేగ్, అమీరుద్దీన్, మునీర్ అహ్మద్, జిల్లా కార్యవర్గం మహమ్మద్ ఖాసిం, మహమ్మద్ గౌస్, షక్షావలి, జిశాన్, న్యామతుల్లా, రఫీ తదితరులు పాల్గొన్నారు.

పోటీ తత్వంతో ముందుకు సాగాలి

విశాలాంధ్ర-పాణ్యం : ప్రస్తుత సమాజంలో ఆరోగ్యకరమైన పోటీ తత్వంతో విద్యార్థులు ముందుకు సాగాలని విజయానికేతన్ విద్యాసంస్థల డైరెక్టర్ విజయ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థుల జీవిత అభివృద్ధికి ఉపాధ్యాయుల పాత్ర ఎంత ఉందో తల్లిదండ్రులు కూడా అంతే పాత్ర పోషించాలని తల్లిదండ్రులకు సూచించారు. క్రమశిక్షణతో కూడిన చదువు జీవితంలో ఉన్నతంగా స్థిరపడడానికి తోడ్పడుతుందని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. వచ్చే విద్యా సంవత్సరంలో విజయానికేతన్ జూనియర్ కళాశాలను ప్రారంభిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలియజేశారు. పాణ్యం మండల కేంద్రంలో కార్పొరేట్ కు దీటుగా అతి తక్కువ ఫీజు తో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధిస్తున్నామని అలాగే సైనిక్ నవోదయ లాంటి ప్రవేశ పరీక్షలలో కూడా తమ విజయానికేతన్ విద్యార్థులు జయకేతనం ఎగురవేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ ఇంచార్జ్ మురారి వేణుగోపాల్, కోఆర్డినేటర్లు బ్రహ్మం, జహీర్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాలమేరకు నంద్యాల సబ్ డివిజన్ ఎఎస్పీ ఎం.జావళి సూచనలతో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున గుప్తా ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు పట్టణ కేంద్రంలో మైనర్లు వాహనాలు నడపడంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 22మంది మైనర్లు చట్టవిరుద్ధంగా ద్విచక్ర వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి, ఒక్కొక్కరికి రూ.5వేలు జరిమాన విధించడంతో పాటు వారిని తల్లిదండ్రులు, సంరక్షకులను స్టేషన్ వద్దకు పిలిపించి రహదారి భద్రత, మైనర్ల వాహన నడపడం వల్ల కలిగే చట్టపరమైన పరిణామాలు, బాధ్యత గల పర్యవేక్షణ అవసరంపై అవగాహన కల్పించారు.

హెూంగార్డు శ్రీరాములుకు ఆర్థిక సాయం



విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఉయ్యాలవాడ పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న హెూంగార్డు శ్రీరాములు అనారోగ్యంతో బాధపడుతుండడంతో శ్రీరాములుకు తోటి హెూంగార్డులు ఆర్థిక సహాయం అందించారు. హెూంగార్డు శ్రీరాములు మెదడులో రక్తం గడ్డ కట్టి నంద్యాలలోని ఉదయానంద ఆసుపత్రిలో చికిత్స తీసుకుని ఇంటికి చేరుకున్నారు. శ్రీరాములు ఆసుపత్రి ఖర్చులకు గాను ఆళ్లగడ్డ డి.ఎస్.పి ప్రమోద్ ,మిగిలిన పోలీసు సిబ్బంది అందరూ తమ వంతు సహాయంగా రూ.50వేలు వారి కుటుంబ సభ్యులకు డిఎస్పి కార్యాలయంలో ఆదివారం అందజేయడం జరిగింది. ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధి లోని పోలీసు సిబ్బందికి ఏదైనా అనుకోకుండా అనారోగ్యం వలన ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లయితే వారికి అండగా ఉంటామని డీఎస్పీ ప్రమోద్ భరోసా ఇవ్వడంతో పోలీసు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ మురళీధర్ రెడ్డి, ఉయ్యాలవాడ ఎస్సై రామిరెడ్డి, ఆళ్లగడ్డ యూనిట్ ఇన్చార్జి రవీంద్ర, ఆళ్లగడ్డ యూనిట్ పిఎస్సి నజీర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బిజినవేముల గ్రామానికి చెందిన దస్తగిరి (30) ఆదివారం మృతి చెందారు. అతని మృతికి కారణాలు తెలియలేదని తల్లి నాగలక్షుమ్మఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లికార్జున్ రెడ్డి తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 27, అక్టోబరు 2025

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర - ఆదోని : ఈనెల 31వ తేదీన ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అజయ్ బాబు, జిల్లా సహా కార్యదర్శి ఓబి నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ బాబు మాట్లాడుతూ 105ఏళ్ల క్రితం దేశంలో ఏర్పడిన మొట్ట మొదటి కార్మిక సంఘం, దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న సంఘం, బానిస వ్యవస్థకి వ్యతిరేకంగా పోరాటం చేసిన సంఘం, దేశంలో మౌలిక సమస్యల పరిష్కారం కోసం, కార్మికుల హక్కుల కోసం, కార్మికుల రక్షణ కోసం పోరాటం చేసిన సంఘం ఏఐటీయూసీ అని తెలిపారు. 105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాల్సిన బాధ్యత కార్మిక వర్గంపై ఉందన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న అన్ని హక్కులను కాలరాసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల వ్యవహారశైలి ఉందని, కార్పొరేట్ల సేవలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మునిగి తేలుతున్నాయని ఆరోపించారు. కార్మిక ఓట్లతో గద్దె నెక్కిన ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు వై టి భీమేష్, బి.వెంకన్న, జిల్లా సమితి సభ్యులు హుసేని, షేక్షావలి, లక్ష్మీనారాయణ, హమాలి వర్కర్ రామంజి, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ లక్ష్మన్న, జోసఫ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భూకమతాల వర్గీకరణ మార్కింగ్ ప్రక్రియను పూర్తిచేయాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : భూకమతాల వర్గీకరణ మార్కింగ్ ప్రక్రియనును ఈ నెల 29 వ తేదీ లోపు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఆదివారం మండల,డివిజన్ వ్యవసాయ శాఖ అధికారులతో భూకమతాల వర్గీకరణ, ఈ పంట నమోదు, పత్తి, ఉల్లి పంటల హార్వెస్టింగ్‌పై కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 9లక్షల 94వేల 879ఖాతాలకు సంబంధించి మార్కింగ్ చేయాల్సి ఉందని, ఇందులో ఇంకా రెండు లక్షలు పెండింగ్ ఉందని, ఈ ప్రక్రియను ఈ నెల 29వ తేదీ లోపు పూర్తిచేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఆదోని, హోలహర్వి, ఓర్వకల్లు,ఆలూరు, చిప్పగిరి కృష్ణగిరి మండలాల్లో ఎక్కువగా పెండింగ్ ఉందని,త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ లను అందర్నీ ఒక చోటకు చేర్చి ఆన్లైన్ లో ఈ ప్రక్రియ పూర్తి చేసేలా చూడాలని మండల వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి భూకమతాల వర్గీకరణ మార్కింగ్, పత్తిపంట హార్వెస్టింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పంట నమోదును కూడా 29 వ తేదీ లోపు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా పంట నష్టం జరిగి ఉంటే ఆ వివరాలను కూడా 34 కాలం ప్రొఫార్మాలో వివరాలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రేపటి నుండి 29 వ తేదీ వరకు భారీ వర్షాల నేపథ్యంలో పత్తి, ఉల్లి పంటల కోత జరుగకుండా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పత్తి పంటకు మంచి రేటు వచ్చే విధంగా హార్వెస్టింగ్ పై రైతులకు సలహాలు అందచేయాలని సూచించారు. తేమ శాతం లేకుండా పత్తి పంటను డ్రై చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. పత్తి పంట ఎంత సాగు అయింది, ఎన్ని కోతలు కోశారు. ఎంత ధర పలుకుతోంది అన్న వివరాలను పత్తి పంట పండించే మండలాల వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మిలు పాల్గొన్నారు.

పీపీపీ విధానాన్ని రద్దు చేయాల్సిందే..!

విశాలాంధ్ర - చిప్పగిరి : ప్రభుత్వం మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, పీపీపీ విధానాన్ని రద్దు చేయాలంటూ ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి అన్నారు. ఆదివారం ఆలూరు నియోజకవర్గం చిప్పగిరి మండలం పరిధిలోని రామదుర్గం, నగరడోణ, నేమకల్లు గ్రామాలలో ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వమెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ రచ్చ బండ కార్యక్రమం నిర్వహించారు. రామదుర్గం గ్రామంలోనే రచ్చ బండ కార్యక్రమంలోఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి మాట్లాడుతు ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయకూడదని ఉద్దేశంతోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల కార్య క్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటికరణ చేస్తూ పేదలకు వైద్యం అందకుండా చేస్తుందన్నారు.వైసీపీ మండల జడ్పీటీసీ,సర్పంచ్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గం కార్యవర్గ సభ్యులు, మండల కార్యవర్గ సభ్యులు,వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, కో కన్వీనర్, తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాలను బాధిత కుటుంబాలకు అందచేశాం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : డిఎన్ఏ పరీక్షలు పూర్తయ్యాక, గుర్తింపు నిర్ధారణ అయిన అనంతరం సంబంధిత బాధిత కుటుంబాలకు మృతదేహాలు అందచేసి వారి స్వగృహాలకు అంబులెన్స్ లో పంపించడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఆదివారం పేర్కొన్నారు. చిన్నటేకూరులో ఇటీవలి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో మరణించిన వారి డిఎన్ఏ పరీక్షలు పూర్తయ్యాక, గుర్తింపు నిర్ధారణ అయిన అనంతరం సంబంధిత బాధిత కుటుంబాలకు మృతదేహాలను అందచేసి వారి స్వగృహాలకు కలెక్టర్, ఎస్పీ అంబులెన్స్‌లో పంపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొన్న వి కావేరి ట్రావెల్స్ బస్ ఆక్సిడెంట్ జరిగిందని, ప్రమాదంలో 19 మంది మరణించారన్నారు. మరణించిన వారి ఫోరెన్సిక్ శాంపిల్స్ తీసుకొని వారి బంధువుల డి ఎన్ ఏ శాంపిల్స్ సేకరించి ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్ విజయవాడకు పంపించి, శాంపిల్ అన్ని మ్యాచ్ అయి ఈరోజు రావడం జరిగిందన్నారు. అందువల్ల సంబంధిత మృతదేహాలను వారి వారి బాధిత కుటుంబాలకు అందచేయడం జరిగిందన్నారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు 10మృతదేహాలను 7కుటుంబాలకు అందజేయడం జరిగిందన్నారు. ఇంకా 7మృతదేహాలను కూడా వారి వారి కుటుంబ సభ్యులు ఈరోజు మధ్యాహ్నం 3 గంటల నుండి 8 గంటల సమయంలో వారు కూడా వస్తామని చెప్పారని, వారు కూడా రాగానే మృతదేహాలను అందజేయడం జరుగుతుందన్నారు. రేపు మిగిలిన వారి కుటుంబ సభ్యులు వస్తున్నారని, వారికి కూడా మృతదేహాలను హ్యాండోవర్ చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.. చనిపోయిన వారిలో గుర్తించని మృతదేహం ఒకటి ఉండగా, అందుకు సంబంధించి కూడా పోలీస్ శాఖ సహాయంతో త్రిమూర్తులు అనే వ్యక్తిగా ట్రేస్ చేయడం జరిగిందన్నారు. వారి కుటుంబ సభ్యుల డిఎన్ఏ కూడా ఈరోజు ఉదయం కలెక్ట్ చేసుకోవడం జరిగిందని, రేపు ఉదయానికి డిఎన్ఏ ఫలితం రాగానే, ఆ మృతదేహాన్ని కూడా వారి బంధువులకు అందచేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. బీహార్ రాష్ట్రానికి చెందిన 48 సంవత్సరాల వయస్సు గల అమృత్ కుమార్ అనే వ్యక్తి కుటుంబ సభ్యులు ఇక్కడే దహన సంస్కారాలు చేశారని, అందుకోసం మున్సిపల్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో సంబంధిత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాకు సంబంధించి సంబంధిత బాధిత కుటుంబాల బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకొని నివేదికను కూడా ప్రభుత్వానికి పంపించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు.

అధిక ఖర్చులు.. లోపించిన నాణ్యత

విశాలాంధ్ర - ఆదోని రూరల్: వాణిజ్య పంటల్లో ప్రధానమైనది పత్తి ఆదోని మండల పరిధిలో పత్తి 56,491 ఎకరాల్లో, వేరుశనగ 789 ఎకరాలు,కంది 537 ఎకరాల్లో, సజ్జ 85ఎకరాల్లో, వరి 2,768 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఈ ఏడాది అధిక వర్షాలతో అతివృష్టి సంభవించి అన్ని రకాల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అతివృష్టితో ఇటువంటి ఇబ్బందులను ఎదుర్కొన్న రైతు పొలంలో పత్తితీతకు వ్యవసాయ కూలీల సమస్య తీవ్రతరమైంది.అధిక వర్షాలతో పత్తి నాణ్యత కోల్పోయి ధరలపై ప్రభావం చూపనిందని రైతులు వాపోతున్నారు. ఆదోని మండల పరిధిలో అధిక వర్షపాతం నమోదు కావడం వల్ల పత్తికాయ కుళ్ళిపోయి, మొక్కలు ఎదుగుదల తగ్గిపోయిందని, ఆకులు రాలిపోయి మొక్కలు ఎండిపోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరగడంతో పత్తికాయ పగిలి తీతకు వ్యవసాయ కూలీలు కరువయ్యారని ఉన్న పత్తి రైతులు తెలిపారు.

రైతుకు తప్పని తిప్పలు : వాతావరణ పరిస్థితుల మార్పుతో పగిలిన పత్తి తీతకు వ్యవసాయ కూలీల సమస్యతో పొలంలోనే మొక్కపై ఉంటూ నాణ్యతకు కోల్పోవడం జరుగుతుందని రైతులు గోడు వినిపిస్తున్నారు. పచ్చి దిగుబడులు అంతంత మాత్రంగానే దిగుబడులు వస్తుండడంతో ఆపరిణామాలు రైతులను తీవ్రంగా ఆందోళనకు గురిచేస్తున్నాయి. వ్యవసాయ కూలీలు వేధిస్తుండడంతో పత్తి తీతకు జాప్యం అవుతుంది. వ్యవసాయ కుటుంబాల్లో పనులు చేసే వారు తగ్గిపోవడంతో పనులకు ఇబ్బందిగా ఏర్పడింది. వ్యవసాయ మార్కెట్లో పత్తి ధరలు అంతంత మాత్రంగానే ఉండటంతో గిట్టుబాటు కావడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలంలో నిరుడు పత్తితీతకు కిలో రూ.14-16 లు దాక చెల్లించిన వ్యవసాయకులీలు దొరకడం కరువైంది. ఈ ఏడాది సీజన్లో ఆదోని పట్టణ కేంద్రం నుంచి వ్యవసాయ కూలీలు రావడంతో దినసరి కూలి రూ.,500 లు రైతులు చెల్లించి అతి కష్టకాలంలో రైతు పత్తితీతను తీసేసుకుంటున్నాడు. పెరిగిన పెట్టుబడులతో రైతుకు మిగిలేది శూన్యమేనంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. లోతట్టు పంట పొలాలు నీట మునిగాయి. ఈ ఏడాది రైతులకు అప్పులతో కూడిన తిప్పలు సంభవించాయి. సొంత భూమి ఉన్న రైతుల పరిస్థితి ఇలా ఉంటే కౌలుకు చేసే వ్యవసాయ రైతుల పరిస్థితి ఎంత మేరకు దుర్భర పరిస్థితిలో ఉంటున్నారో చెప్పనక్కర్లేదు.

అతి క్లిష్ట పరిస్థితుల్లో వ్యవసాయం

చిగిలి సోమప్ప రైతు, అలసందగుత్తి

కోటి ఆశలతో 8ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని ఆరుగాలం కష్టపడి పంట సాగు చేసి చీడపీడ పురుగుల ప్రభావాన్ని జయిస్తూ, మరోవైపు అధిక వర్షాల ప్రభావంతో పంట తీవ్రస్థాయిలో దెబ్బతినడం రైతు కంటికీ కన్నీరుగా మిగిల్చింది.ప్రభుత్వం ఆదుకోకపోతే భవిష్యత్తరం వ్యవసాయంపై ముగ్గు చూపని పరిస్థితులు దాపరించి ఉన్నయి.

రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి మదిరి ఎల్లప్ప

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ మొదలుకొని అధిక వర్షాలతో అతివృష్టి సంభవించి పంటలు పూర్తిగా నాశనం అయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని పంట పొలాలను పరిశీలించి పరిహారం చెల్లించి వ్యవసాయ రంగాన్ని కాపాడాలి.

పత్తి సాగులో మంచి దిగుబడులు

బివిజి.సుధాకర్, మండల వ్యవసాయ అధికారి

ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన పత్తి ఆశించిన మేరకే దిగుబడులు వచ్చాయి. ఎర్రరేగడి నేలల్లో 8-10 క్వింటాలు నల్ల రేగడి నేలల్లో 10-12క్వింటలు మేరకు దిగుబడులు వచ్చాయి. పత్తి తీతకోతల్లో వ్యవసాయ కూలీల సమస్యతో కాస్త ఆలస్యం అవుతున్నాయి.

జీవన ఉపాధికై ప్రత్యామ్నాయం చూపించాలి

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు రూరల్ : ఎమ్మిగనూరు పట్టణం నందు వీవర్స్ కాలనీ వైడబ్ల్యూసిఎస్ మైదానంలో మున్సిపల్ అధికారులు తొలగించిన, దుకాణాల యజమానులకు జీవన ఉపాధికై ప్రత్యామ్నాయం చూపాలని సీపీఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా సమయంలో జీవన ఉపాధికై వైడబ్ల్యూసీఎస్ మైదానంలో తెలిసో, తెలియకో లేక అప్పటి రాజకీయ నాయకులు అండదండలతో కొంతమంది దుకాణాలను ఏర్పాటు చేసుకుని వైడబ్ల్యుసిఎస్ వారికి అడ్వాన్స్‌గా రూ.25 వేలు,ప్రతి నెల దుకాణానికి బాడిగ రూ.4వేలు చెల్లిస్తు, కొంతమంది పేదలు పొట్ట నింపుకుంటు జీవనం గడుపుతున్నారు, కానీ ఆ దుకాణాలను తొలగించాలని మున్సిపల్ అధికారులు ముందస్తు సమాచారం లేక నోటీస్ ఇవ్వకుండా నిన్న తెల్లవారుజామున ఆ దుకాణాలను ధ్వంసం చేసి తొలగించడం బాధాకరం, దుకాణాల యజమానులు ఒక్కొక్క దుకాణాన్నికి రూ.లక్షలు పెట్టి తయారు చేసుకోవడం జరిగిందని,ముందస్తు నోటీస్ ఇచ్చి దుకాణాలను తొలగించాలని చెప్పి ఉంటే దుకాణాలను మరో ప్రాంతానికి తీసుకెళ్లే వాళ్ళమని దుకాణాల యజమానులు చెప్పడం జరిగిందని వారు తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి దుకాణాల ద్వారా కూరగాయల వ్యాపారంతో పొట్ట పోసుకుంటున్న కుటుంబాలు రోడ్డు నా పడకుండా ప్రత్యామ్నాయం చూపాలని వారు డిమాండ్ చేశారు.

గల్లంతైన యువకుడి శవం లభ్యం

విశాలాంధ్ర - చిప్పగిరి : అనంతపురం జిల్లా గుంతకల్ మండలం, కసాపురం వద్ద గల్లంతైన చిప్పగిరి మండలం రామదుర్గం గ్రామానికి చెందిన రాజు(26) అనే యువకుడు శవమై ఉరవకొండ మండలం, రాగులపాడు వద్ద హంద్రీ కాలువలో లభించింది. గుంతకల్ మండలం బుగ్గ సంగాల దేవాలయంలో పెళ్లికి వెళ్లిన రాజు కసాపురం వద్ద హంద్రీనీవా కాలువలో నీళ్లు తాగడానికి వెళ్లి కాలుజారీ పడ్డాడు. తోటి మిత్రులు రాజును రక్షించడానికి ప్రయత్నించగా కాలువలో మునిగిపోయాడు. రామదుర్గం గ్రామస్తులు శనివారం సాయంత్రం దాకా వెతికిన ఆచూకీ దొరకలేదు. ఆదివారం రాగులపాడు వద్ద హంద్రీనీవా కాలువలో శవాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల సమక్షంలో శవాన్ని బయట చేసి బంధువులకు సమాచారం అందించారు. చిప్పగిరి మండలం రామదుర్గం గ్రామానికి చెందిన రాజుది పేద కుటుంబం. తల్లిదండ్రులు పద్మావతి, ఏలీయాస్ వ్యవసాయ కూలీలు, వీరికి నలుగురు సంతానం, ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లి చేశారు. ఇద్దరు కుమారులు హరి ప్రసాద్, రాజు తండ్రి ఏలియాస్ కూలి పనికి వెళ్లి చెట్టు కొమ్మను కోస్తూ చెట్టుపైనుండి కిందపడి ఈ మధ్యనే మృతి చెందాడు. కుటుంబ పెద్ద మృతి చెందిన చేదు జ్ఞాపకాలు మరవక ముందే హంద్రీనీవా కాలువలో పడి రాజు మృతి చెందడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబ పెద్దతో పాటు చేతికి అంది వచ్చిన కుమారుడు రాజు మృతి కుటుంబానికి తీరని లోటని ప్రభుత్వం ఆకుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని రామదుర్గం గ్రామ సర్పంచ్ రోహిణి, గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

విశాలాంధ్ర - కర్నూలు : జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు, నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.

మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

విశాలాంధ్ర-ఆలూరు : ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ శ్రీమతి వైకుంఠం జ్యోతి ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ఆమె నివాసంలో జరిగింది. అక్షిత చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో రూ.14వేలు విలువ గల కుట్టు మిషన్లు సబ్సిడీ ధరగా రూ.6,700కు మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ ఒక మహిళగా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేయడం నా ధ్యేయం అని తెలిపారు. కుట్టు మిషన్లు అందుకున్న మహిళలు సంతోషం వ్యక్తం చేస్తూ, తక్కువ ధరకు మిషన్లు అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

దొంగలు అరెస్టు.. రూ.25 లక్షలు స్వాధీనం

విశాలాంధ్ర - క్రిష్ణగిరి : అమకతాడు టోల్ ప్లాజా దగ్గర బస్సులో రూ.25 లక్షలు ఎత్తుకెళ్లిన దొంగలను అరెస్ట్ చేసి వారి దగ్గర ఉన్న 25 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్దుర్తి సిఐ మధుసూదన్ రావు, క్రిష్ణగిరి ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ రాజస్థాన్‌కు చెందిన ప్రవీణ్ రావెల్ హైదరాబాదులో నివాసం ఉంటూ వెండి వ్యాపారం చేసేవాడు అన్నారు. వ్యాపారం నిమిత్తం హైదరాబాదు నుండి బెంగళూరుకు రూ.25 లక్షలు తీసుకొని బస్సు ఎక్కారన్నారు. కర్నూల్ దాకా టికెట్ తీసుకొని ఉదయం నాలుగు గంటలకు బస్సు దిగారు అన్నారు. కర్నూల్ నుండి గుత్తి వరకు టికెట్ తీసుకొని డబ్బుల బ్యాగుతో వ్యాపారి బస్సు ఎక్కారన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు కర్నూల్ బళ్లారి చౌరస్తాలో బస్సు ఎక్కి అనంతపురంకు టికెట్ తీసుకున్నారన్నారు. అమకతాడు టోల్ గేట్ దగ్గర బ్యాగు తీసుకొని ఇద్దరు వ్యక్తులు దిగి వెళ్లడం బస్సు డ్రైవర్ గమనించి అనంతపురంకు టికెట్ తీసుకొని ఇక్కడ దిగుతున్నారు ఏంటి అని బస్సులో ఉన్న ప్రయాణికుల అందర్నీ మేల్కొల్పారన్నారు. బస్సులో ఉన్న వెండి వ్యాపారి బ్యాగు చూసుకొనగా డబ్బుల బ్యాగు లేకపోవడంతో వెంటనే సమీపంలో ఉన్న పెట్రోలింగ్ పోలీసుల వారికి సమాచారం ఇచ్చారన్నారు. దీంతో అన్ని రూట్లకు పోలీసులను అలర్ట్ చేయడంతో కర్నూల్ ఇడ్లీ హోటల్ దగ్గర దొంగలు దొరికారన్నారు. ప్రవీణ్ రావెల్ ఫిర్యాదు మేరకు సీఐ మధుసూదన్ రావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వారు తెలిపారు. ఇంకను విచారణ పూర్తి కాలేదు పూర్తి వివరాలు తెలియ రావలసి ఉంది.

మరిన్ని వార్తలు E-PAPERలో

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరగాలి

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ : విద్యార్థి దశలో చిన్నారుల ఆత్మవిశ్వాసం పెంచడంలో తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని స్కూల్ క్లస్టర్ ప్రిన్సిపల్ అన్వర్ భాష తెలిపారు. స్థానిక కర్నూల్ పట్టణం మాధవ్ నగర్‌లోని నారాయణ పాఠశాలలో ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ఈ చాంప్స్ విభాగంలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ఎల్‌సి) ప్రారంభించారు. ముందుగా విద్యార్థుల నేతృత్వంలోని సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన క్లస్టర్ ప్రిన్సిపాల్ తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు తమ అభ్యాస బాధ్యతను తీసుకోవడానికి ప్రోత్సహించినప్పుడే తమ పిల్లల పురోగతి తెలుస్తుందన్నారు. ఇలాంటి ప్రదర్శన కారణంగా తమ పిల్లల నైపుణ్యాలు మరింతగా అభివృద్ధి చెంది ఉన్నత శిఖరాలకు చేరుకుంటారనీ సూచించారు. సమావేశంలో విద్యార్థులు సాధన చేసిన అభ్యాసనాన్నీ వారి పురోగతిని తల్లిదండ్రులకు స్వయంగా వివరిస్తారించడం విశేషం. ఈ చాంప్స్ కోఆర్డినేటర్ షాహిదా, వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరి పాల్గొన్నారు.

ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవంను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పత్తికొండ: ఈనెల 31న ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి ఎన్.కృష్ణయ్య, సీపీఐ మండల కార్యదర్శి యు.కారుమంచి, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి రంగన్న పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక చదువుల రామయ్య భవనంలో ఏఐటీయూసీ ముఖ్యుల సమావేశం నియోజకవర్గ అధ్యక్షులు నెట్టికంటయ్య అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకుంటూ 44 కార్మిక చట్టాలను కేవలం నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. సుప్రీం కోర్ట్ తీర్పు ప్రకారం సంఘటిత, అసంఘటితరంగ కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు అమలు, పిఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ రంగాల కార్మికులు మాదన్న, సుంకమ్మ, నాగరాజు, ఉచ్చీరప్ప, శీను, విజయ్, అశోక్, హరి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్త సమ్మెకు సిద్ధం : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు రూరల్ : మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 3 తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల చేపట్టనున్న సమ్మెకు సిద్ధం అని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లప్ప, మున్సిపల్ కార్మికులు శివ, భీముడు, చిన్ని ఈరన్న, విక్రం తెలిపారు. అనంతరం సీపీఐ కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులతో పాటు ఏఐటీయూసీ తాలుక అధ్యక్షులు వీరేష్,పట్టణ అధ్యక్ష కార్యదర్శులు నరసింహారెడ్డి, విజయేంద్ర పాల్గొని మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలపై గత ప్రభుత్వంలో మున్సిపల్ కార్మికులు సమ్మె బాట పట్టారని, ఆ సందర్భంలో చంద్రబాబు, లోకేష్ మద్దతిస్తూ వైసిపి పాలన మున్సిపల్ కార్మికుల హక్కులను కాలు రాస్తుందని మన ప్రభుత్వం వచ్చిన తర్వాత మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని వారు గుర్తు చేశారు. నాయకులు ఉరుకుందు, శివ,మహేష్,యోహాన, తదితరులు పాల్గొన్నారు.

కనీస అవసరాలు లేక ప్రజలు ఇక్కట్లు

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : మండగిరి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ మహాయోగి లక్ష్మమ్మ అవ్వ కాలనీలో కనీస అవసరాలు లేక ప్రజలు తీవ్రస్థాయిలో ఇబ్బందులకు గురవుతున్నారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ గుడిసి ఆదికృష్ణమ్మ తెలిపారు. ఆదివారం శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కాలనీలో ఆమె అనుచరులతో కలిసి పర్యటించారు. కాలనీలో సీసీ రోడ్లు,డ్రైనేజీ లేక పక్కనే ఉన్న కొండ ప్రాంతం నుంచి వర్షపు నీరు పెద్ద ఎత్తున రావడంతో ఇళ్లలోకి నీళు చేరుతున్నాయని కాలనీవాసులు అదృష్టికి తీసుకువచ్చారు. సుధీర్ గంగా 25ఏళ్ల పాటు నివాసం ఉంటున్న ఏ ఒక్క నాయకుడు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తక్షణమే కాలనీలో సిసి రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేసి తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని గుడిసె ఆది కృష్ణమ్మను కోరారు. ప్రజల కోరిక మేరకు గుడిశాలి కృష్ణమ్మ స్థానుకులంగా స్పందిస్తూ సంబంధిత సమస్యల పట్ల అధికారుల దృష్టికి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి తొందరలోనే పరిష్కారం అయ్యే విధంగా తగిన కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం గుడిసె ఆది కృష్ణమ్మకు శాలువా కప్పి పూల మాలతో ఘనంగా సన్మానం చేశారు. మాజీ ఎంపీపీ మురళి,మాజీ కౌన్సిలర్ మారుతి, భాస్కర్, లక్ష్మీనారాయణ, బాబురావు, దేవేంద్రలు పాల్గొన్నారు.

హోలహర్విలో ఒకే ఒక్కడూ..!

- ఉపాధ్యాయులు లేక విద్యార్థుల ఇబ్బందులు
- ఒక్క ఉపాధ్యాయుడితో 5తరగతులు నిర్వహణ
- మా పిల్లలకు టీసీ లిస్తే బతుకు తెరువుకు వెళ్తాం
- మంత్రి లోకేష్ స్పందించాలని కోరుతున్నా ప్రజలు

విశాలాంధ్ర - నందవరం : కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యా వ్యవస్థలో ఉన్న లోపాలకు అద్దం పడుతున్నాయి. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు బోధన, అభ్యస ప్రక్రియకు తీవ్ర విఘాతం కలుగుతుంది. నందవరం మండలంలోని హోలహర్వి గ్రామంలో వున్న ఎంపిపి మోడల్ పాఠశాలలో 150 మంది విద్యార్థులకు గాను ఒకే ఒక్క ఉపాధ్యాయుడు బోధిస్తున్నాడు. పాఠశాలలో ఒకటో తరగతి నుండి ఐదో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో ఒకే ఉపాధ్యాయుడు ఉండడంతో విద్యార్థులకు సక్రమంగా విద్య భోదనా జరగకపోవడంతో విద్యార్థులు చదువుల్లో చాలా వెనుక పడుతున్నారని తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడున్న ఉపాధ్యాయులు పి.చంద్రయ్య కూడా ఆరోగ్యరీత్యా తలకు, వెన్నెముకకు మేజర్ ఆపరేషన్లు చేయించుకున్న విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రోజువారీగా పాఠశాలకు హాజరై విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నారు. అయన సొంత డబ్బుతో ఇద్దరు వాలంటరీలని ఏర్పాటు చేసుకుని విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఆయన ఒక్క రోజు పాఠశాలకు రాకపోతే ఆరోజు మొత్తం పాఠశాల మూతపడి, పిల్లలు బడిబాట కాకుండా పొలం బాట పట్టే అవకాశం ఉంది. గత డీఎస్సీలో ఉపాధ్యాయులు పాఠశాలకు కేటాయిస్తారనీ అనుకుంటే ఒక ఉపాధ్యాయుడిని కూడా కేటాయించకపోవడంతో విద్యార్థులు తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు ఏమవుతుందని, టిసిలిస్తే ప్రైవేట్ పాఠశాలలకు, లేకపోతే బతుకు తెరువు కోసం పట్టణలకు తీసుకు వెళ్తామని అంటున్నారు. పాఠశాలలా అభివృద్ధి కోసం రూ.కోట్ల ఖర్చు చేస్తున్నా, ఇలాంటి ఏకోపాధ్యాయ పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించకపోవడంతో ఆ పాఠశాలలు మూతపడడం జరుగుతుంది. ఇప్పకటికైన హోలహర్వి పాఠశాలకు విద్య శాఖ మంత్రి నారా లోకేష్, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి వెంటనే పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని, లేకపోతే 150 మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారబోతుంది.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, సోమవారం 27, అక్టోబరు 2025

గర్భాలయ మూసివేతపై భక్తుల ఆందోళన

అధికారుల జోక్యంతో.. సమస్య పరిష్కారం

విశాలాంధ్ర - కోడుమూరు : పట్టణంలోని కోటవీధిలో వెలసిన ప్రసిద్ధ శ్రీ భీమలింగేశ్వర స్వామి దేవస్థానంలో గర్భాలయం తలుపులు మూసి తాళం వేయడంతో గత కొద్ది రోజులుగా భక్తుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. కోటవీధిలో నివసించే సుధాకర్ శర్మ అనే వ్యక్తి ఉదయం వేళల్లో గర్భాలయానికి తాళం వేయడంతో భక్తులు,శివమాలధారణ స్వాములు, కాలనీ ప్రజలు తీవ్ర అసౌకర్యం ఎదుర్కొంటున్నారని భక్తులు ఆరోపించారు. ఈ విషయమై భక్తులు శనివారం కోడుమూరు జెడ్పిటిసి రఘునాథరెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లగా, ఆయన జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి విచారణ జరపాలని కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం దేవాదాయ శాఖ అధికారి వై గుర్రెడ్డి కోడుమూరు చేరుకొని ఆలయంలో సుధాకర్ శర్మ గర్భాలయానికి తాళం వేస్తున్న అంశంపై విచారణ చేపట్టారు. విచారణ ఉన్న సమాచారంతో భక్తులు, శివస్వాములు, మహిళలు పెద్దసంఖ్యలో ఆలయం వద్దకు చేరడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విచారణ అనంతరం దేవాదాయ శాఖ అధికారి వై.గుర్రెడ్డి మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇకపై యథావిధిగా స్వామివారికి పూజలు,సేవలు కొనసాగుతాయని చెప్పారు. ఆలయాన్ని మూసివేసే హక్కు ఎవరికి లేదని స్పష్టం చేశారు. ఆలయానికి 11.50ఎకరాల దేవాదాయ భూములు ఉన్నాయని,వాటి ఆదాయంతోనే దూప,దీప,నైవేద్యాలు నిర్వహించబడుతున్నాయని పేర్కొన్నారు. ఇకపై అర్చకుడు రంగస్వామి ఆధ్వర్యంలో ఆలయ సేవలు నిరాటంకంగా కొనసాగనున్నాయని భక్తులకు సూచించారు. జెడ్పిటిసి రఘునాథరెడ్డి, తేనెశ్వరరెడ్డి,రమేష్ నాయుడు,అలాగే విశ్వహిందూ పరిషత్ సభ్యులు సర్రా నాగేశ్వరరావు,పెనుమాడ కిరణ్, నటరాజ్ తదితరులు భక్తుల పక్షాన అధికారులతో మాట్లాడారు. ఇదిలా ఉండగా స్థానిక పోలీసులు కూడా సమాచారం అందుకొని ఆలయానికి చేరుకుని పరిస్థితులను సమీక్షించారు. హైదరాబాద్ హిందూ చైతన్య వేదిక సభ్యులు మాధవ్,రాజేష్ తదితరులు కూడా విచారణలో పాల్గొన్నారు.

స్కేటింగ్ సాధనలోనే పథకాల సాధ్యం

విశాలాంధ్ర - కర్నూలు : నిత్య రోజు స్కేటింగ్ సాధన చేయడం వల్ల చక్కటి ఆరోగ్యంతో పాటు మంచి ఫలితాలు వస్తాయని మానవత కన్వీనర్ ఆని ప్రతాప్ అభిప్రాయపడ్డారు. ఆదివారం బి క్యాంపు చివరిలోని ఈట్ స్ట్రీట్ ఖానా ఖజానా రోడ్డులో నేటి ఉదయం జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ప్రతాప్ పాల్గొని జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందరించి సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ నిత్యసాధన పథకాలకు పథకాలు సాధించడానికి అవకాశం ఉంటుందని ఇంతమంది పిల్లలు స్కేటింగ్ లో పాల్గొనడం ఆనందదాయకమని కర్నూల్ కు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో రిటైర్డ్ ఇంజనీరు ప్రతాప్ స్కేటింగ్ జిల్లా స్కేటింగ్ కార్యదర్శి అబ్బుబాకర్ స్కేటింగ్ సీఈవో పి.సునీల్ కుమార్ జాయింట్ సెక్రెటరీ పునీతా చౌదరి, స్రవంతి పాల్గొని క్రీడాకారులను అభినందించారు ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు నవంబర్ 1 నుంచి కాకినాడలో జరిగే రాష్ట్ర పోటీలలో క్రీడాకారులు పాల్గొటారు. క్వాడ్ స్కేటింగ్‌లో వీరే 6,8 ఇయర్స్ దానిష్ రాయల్, హితక్, సాత్విక్ చౌదరి, జ్ఞాన దేవాన్ష్, బాలికల్లో నైనిక, సుచిత్ర, 10 -12 ఇయర్స్ శ్రీతిక్ చౌదరి, జశాంక్ ఆర్,ర్య ప్రిన్స్ లియో బాలికల్లో దాక్షాయిని, యక్షశ్రీ, దర్శిని 12 -15 లో రయాన్ జయంత్ రెడ్డి , శశాంక్ బాలికల్లో సాహితీ ,జాహ్నవి, భవిష్య తేజ ఇన్ లైన్‌లో సాజిల్, మని చందన ,మణికంఠ, కృతిధర్, ఉజ్వల్ ఆర్యన్ రెడ్డి, వినీత్, రాజు ఎంపికైనట్టు తెలిపారు.

అశోక మహిళా ఇంజినీరింగ్ కళాశాల సీఈవోకు “ద్రోణాచార్య అవార్డు”తో సత్కారం

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ : కర్నూలు జిల్లా అశోక మహిళా ఇంజినీరింగ్ కళాశాల సీఈఓ డా. హరిస్ కృష్ణ ఇటీవల హైదరాబాద్లోని టీ-హబ్‌లో జరిగిన ప్రతిష్టాత్మక కో హార్ట్ లీడర్షిప్ కా న్క్లేవ్‌లో ప్రసంగిస్తూ విద్యా రంగంలో కొత్త దిశగా అడుగులు వేస్తున్నారని మరోసారి చాటుకున్నారు. ఈ కాన్ క్లే వ్లో దేశవ్యాప్తంగా ఉన్న పరిశ్రమ ప్రముఖులు, ఆ విష్కరణల నిపుణులు, విద్యా రంగానికి చెందిన నాయకులు పాల్గొన్నారు. డా.హ రిస్ కృష్ణ అతిథికల్ ఆర్టిఫికేషనల్‌ఇంటలిజెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ (విద్యలో కృత్రిమ మేధస్సు)" అనే కీలక అంశంపై ప్రసంగిస్తూ, ఆధునిక విద్యలో టెక్నాలజీ ప్రాముఖ్యతను వివరించారు. ఆయన మాట్లాడుతూ “భవిష్యత్తు విద్యార్థులు ప్రపంచ స్థాయి సాంకేతిక పోటీలకు సిద్ధంగా ఉండాలంటే, విద్యలో ఆ ర్టిఫిషియల్ ఇంటెలిజెన్సు సమర్ధవంతంగా అనుసంధానం చేయడం అత్యవసరం” అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు టి సిఎస్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ శ్రీ బాల ప్రసాద్, ఐకార్ జాయింట్ డైరెక్టర్ డా. కల్పనా శాస్త్రి వంటి దేశంలోని ప్రఖ్యాత నిపుణులు వేదికను పంచుకున్నారు. వీరందరూ విద్యా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, ఆవిష్కరణలకు సంబంధించిన అనుభవాలను పంచుకున్నారు. విద్యా రంగంలో నూతన ఆలోచనలను అమలు చేస్తూ, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంలో విశిష్ట పాత్ర పోషించినందుకు గుర్తింపుగా డా.హరిస్ కృష్ణకు “ద్రో ణాచార్య అవార్డు” ప్రదానం చేశారు. ఈ అవార్డును టిసిఎస్‌సీ ఐఓ బాల ప్రసాద్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా డా.హరిస్ కృష్ణ మాట్లాడుతూ “ఈ గుర్తింపు నా వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదు, అశోక మహిళా ఇంజినీరింగ్ కళాశాల మొత్తం బృందం కృషికి లభించిన ఫలితం. మా లక్ష్యం ప్రతి విద్యార్థినీ టెక్నాలజీ ఆధారిత భవిష్యత్తు నాయకురాలిగా తీర్చిదిద్దడం” అన్నారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు డా. హ రిస్ కృష్ణకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో కళాశాల విద్యా నాణ్యత, సాంకేతిక ఆవిష్కరణలు, విద్యార్థుల ప్రతి భఅంతర్జాతీయ స్థాయికి చేరుకుంటున్నాయని తెలిపారు. ఈ సత్కారం అశోక ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచింది. విద్యా రంగంలో సాంకేతికతను సమర్థంగా వినియోగించి భవిష్యత్ భారతదేశానికి నూతన దిశ చూపిస్తున్న డా, హ రిస్ కృష్ణ వంటి నాయకులు దేశానికి స్ఫూర్తిదాయకులుగా నిలుస్తున్నారు.

నాణ్యమైన మద్యం నిర్ధారణకు ఏపీ సురక్ష యాప్

విశాలాంధ్ర - పెద్దకడబూరు : నాణ్యమైన మద్యం నిర్ధారణకు ఏపీ సురక్ష యాప్ ఉపయోగించాలని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం పెద్దకడబూరు గ్రామంలోని లక్ష్మీ వైన్స్, తుంగభద్ర వైన్స్ వద్ద కోసిగి ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి ఆదేశాల మేరకు ఎస్సై కార్తీక్ ఆధ్వర్యంలో ఏపీ సురక్ష యాప్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన మద్యం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మద్యం దుకాణాలు మద్యం బాటిళ్లను ఏపీ సురక్ష యాప్ లో స్కాన్ చేసి వినియోగదారులకు విక్రయించాలన్నారు. అలాగే వినియోగదారులు సైతం తమ మొబైల్ లో ఏపీ సురక్ష యాప్ డౌన్ లోడ్ చేసుకుని క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి మద్యం ఒరిజినలా లేదా నకిలీదా అని తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు. అలాగే క్యూఆర్ కోడ్ తో మద్యం బాటిల్ ను స్కాన్ చేస్తే దాని బ్రాండ్, ఎమ్మార్పీ ధర, దుకాణ యజమాని వివరాలు తెలుస్తాయన్నారు. ఏపీలో మద్యం దుకాణాలల్లో నకిలీ మద్యం విక్రయాలకు అవకాశం లేదన్నారు. వైసీపీ తన ఉనికి కోసమే నకిలీ మద్యం విక్రయాలు జరుగుతాయని దుష్ప్రచారం చేస్తుందని విమర్శించారు. ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం వైసీపీ నేతలకు అలవాటుగా మారిందన్నారు. గత ఎన్నికల్లో వైసీపీకి ఏపీ ప్రజలు గట్టి బుద్ధి చెప్పినా వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిలో మార్పు లేదన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ మీ సేవ ఆంజనేయులు, సొసైటీ డైరెక్టర్ గోనుమాను నరసన్న, కోసిగి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కలుగొట్ల లక్ష్మన్న, బీసీ సాధికార రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లికార్జున, బూత్ కమిటీ కన్వీనర్ తలారి అంజీ, నాయకులు బొగ్గుల నరసన్న, గుమ్మల ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

పసుపువంట పై గడ్డిమందు పిచికారి

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని చిన్నవంగలి గ్రామానికి చెందిన లక్ష్మిరెడ్డి అనే రైతు సాగు చేసిన పసుపు పంటపై గుర్తుతెలియని దుండగులు గడ్డి మందు పిచికారి చేశారు. గ్రామానికి చెందిన లక్ష్మిరెడ్డి రెండెకరాల్లో పసుపు పంట సాగు చేశారు. పంటపై శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులెవరో రెండు సెంట్ల పొలం మేర గడ్డిమందు పిచికారి చేసి, అక్కడే ఉన్న డ్రిప్ పరికరాల ద్వారా నీరు సరఫరా అయ్యే ట్యాంకులో గడ్డిమందు వేసి వెళ్లారని బాధిత రైతు వాపోయాడు.

కే.పీ.తండాలో ఉచిత వైద్యశిబిరం

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని కేపీతండా గ్రామంలోని గుడ్వెర్డ్ గాస్పెల్ చర్చి ఆవరణలో వీసీఎఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు విజయచంద్ర ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్యశిబిరానికి చాగలమర్రి పట్టణంలోని కేరళ ఆసుపత్రి వైద్యులు ప్రకాష్ జార్జి, అనిత లతో పాటు మరి కొందరు వైద్య బృందం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలను నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

కట్టెప్ప మృతి పార్టీకి తీరని లోటు : సీపీఎం

విశాలాంధ్ర-హొళగుంద: హొళగుంద మండలం సిపిఎం సీనియర్ నాయకులు జమపూర్ కట్టెప్ప (70) మృతి పార్టీకి తీరనిలోటని సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు,మండల కార్యదర్శి వెంకటేశులు అన్నారు. ఆదివారం హొళగుందలోని కట్టెప్ప భౌతికాయానికి పూలమాల వేసి నివాలర్పించి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హొళగుంద మండలంలో 1986 లో సిపిఎం మాజీ ఎంఎల్‌ఏ ఎం.ఏ.గఫూర్ నాయకత్వంలో పార్టీని స్థాపించి పార్టీ సభ్యుడిగా,హమాలి సంఘం నాయకుడిగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ కడవరకు ఎర్రజెండాతో ఉంటూ సెప్టెంబర్ 25న శనివారం అనారోగ్యంతో మృతిచెందడం అందరిని కలచివేసిందని అన్నారు.కట్టెప్ప ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేస్తామని అయన కుటుంబానికి అండగా పార్టీ ఎల్లవేళలా పనిచేస్తుందని తెలిపారు.కట్టెప్పకు భార్య సోమమ్మా, ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు.నాయకులు క్రిష్ణ,షాకీర్,మల్లయ్య, నాగరాజు పాల్గొన్నారు.

నంద్యాలలో పేకాట శిబిరంపై పోలీసుల మెరుపు దాడులు..!

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణంలో పేకాట శిబిరం పై పోలీసులు శనివారం రాత్రి మెరుపు దాడులు నిర్వహించారు. స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పేకాట స్థావరంపై ఒన్ టౌన్ సిఐ సుధాకర్ నేతృత్వంలోని పోలీస్ బృందం ఆకస్మికంగా దాడి చేయడంతో అక్కడ పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నారు.పట్టుకున్న జూదరులను టుటౌన్ పోలీసులకు అప్పగించారు. దాడి సందర్భంగా పోలీసులు వారివద్ద నుండి రూ.1.30 లక్షల నగదు, పేకాట పత్రాలు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా టుటౌన్ సీఐ అస్రర్ భాషా మాట్లాడుతూ “జూద వ్యసనంపై ఎటువంటి ఉపేక్ష ఉండదు. పట్టణంలో అక్రమ కార్యకలాపాలు గుర్తించిన వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నంద్యాల పట్టణ ప్రజలు పోలీసుల వేగవంతమైన చర్యలను అభినందించారు.

సచివాలయ ప్రహరి గోడ ప్రారంభం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : పెద్దకడబూరు గ్రామంలోని సచి-1కు జెడ్పీ నిధులతో నిర్మించిన ప్రహరీ గోడను ఆదివారం గ్రామ సర్పంచ్ రామాంజనేయులు ఆధ్వర్యంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యనిర్వాహక మండలి సభ్యులు పురుషోత్తం రెడ్డి, ఎంపీపీ శ్రీవిద్య, జెడ్పీటీసీ రాజేశ్వరి, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెడ్పీ నిధులు రూ.3లక్షల వ్యయంతో సచివాలయం - 1కు ప్రహరీ గోడ నిర్మాణం, తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేస్తామన్నారు. సచివాలయానికి పనుల మీద వచ్చే ప్రజలకు సచివాలయ వద్ద మంచినీటి వసతి కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే 15వ ఆర్థిక సంఘం ద్వారా విడుదలైన పంచాయతీ నిధుల తో మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే రహదారిలో నాప బండలు పాతించినట్లు తెలిపారు. చుట్టు ప్రక్కల ఉన్న కుటుంబాల వారికి ఎన్ని మార్లు హెచ్చరించినా చెత్తాచెదారాన్ని వేసి అపరిశుభ్రం చేస్తుండడంతో దాన్ని అరికట్టడానికి నాప బండలు పాతినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ జయరాముడు, మాజీ వీఆర్వో రామలింగారెడ్డి, వైసీపీ బూత్ కమిటీ తాలూకా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, వైసీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి శివరామరెడ్డి, వైసీపీ ప్రచార విభాగం తాలూకా అధ్యక్షులు ముక్కరన్న, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మొత్రు రామాంజనేయులు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బొగ్గుల అర్లప్ప, వైసీపీ నాయకులు బసలదొడ్డి శివరాం మొత్రు దస్తగిరి, మొత్రు ఈరన్న, శాంతిరాజు, రామాంజనేయులు, బారుసబ్బు అనిల్, జాము కృష్ణంరాజు, పంచాయతీ కార్యదర్శి సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయండి

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని చిన్నవంగలి గ్రామంలోని కొత్తకొట్టాల కాలనీలో గత 20సంవత్సరాల క్రితం కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్న తమకు ఈ స్థలం మాదంటూ నోటీసులు ఇవ్వడం విడ్డూరంగా ఉందని కాలనీకి చెందిన 40 కుటుంబాలు వాపోయాయి. చిన్నవంగలి గ్రామానికి చెందిన జిలాన్బాష,రామయ్య, పెద్దపాప, షేక్షావలి, వలిలతో పాటు మరి కొందరికి గ్రామానికి చెందిన కంసాని వెంకటేశ్వర్రెడ్డి కోర్టు నుంచి నోటీసులు పంపించారని వాపోయారు. 2005వ సంవత్సరంలో స్థానిక కొత్తకొట్టాల కాలనీలో 141వ సర్వే నంబరులో 40 సెంట్ల స్థలాన్ని బాధితులు కొనుగోలు చేసి ఇళ్లను నిర్మించుకున్నారు. తిరిగి 2024లో 141 సర్వేనంబరులో 60 సెంట్లు కొనుగోలు చేశారు. అయితే స్థలాన్ని అమ్మిన వారి కుటుంబీకులైన కంసాని వెంకటేశ్వర్రెడ్డి అతని భార్య లక్ష్మీదేవి పేరు మీద ముత్తూ ఫైనాన్స్‌లో లోను తీసుకున్నాడు. అంతటితో ఊరుకోక స్థలం కొని ఇళ్లు కట్టుకున్న వారికి ఆ స్థలం తమదేనంటూ నోటీసులు ఇచ్చారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, జిల్లా ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మంజునాథ్ ఎన్నిక

విశాలాంధ్ర-పత్తికొండ: జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పత్తికొండకు చెందిన జంగమ మంజునాథ్ ఎన్నికయ్యారు. మంజునాథ్ గత కొన్ని సంవత్సరాలుగా జంగం సంక్షేమ సంఘంలో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, అనేక సేవలు అందించారని, ఈయన సేవలను గుర్తించిన రాష్ట్ర నాయకత్వం ఆదివారం కర్నూల్‌లో జరిగిన జంగమ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మంజునాథ్ ను రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈయన ఎన్నిక పట్ల జంగమ సంక్షేమ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంజునాథ్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యవర్గంలో అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు మల్లికార్జున కు కృతజ్ఞతలు తెలిపారు.

క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా నకిలీ మధ్యాన్ని అరికట్టవచ్చు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : మద్యం కొనుగోలులో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి నిజమైన బ్రాండ్, దుకాణం వివరాలు, మద్యం పూర్తి వివరాలను తప్పనిసరిగా తెలుసుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ప్రజలకు సూచించారు. టీడీపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఎన్ఎండి ఫయాజ్ గోస్పాడులోని లక్ష్మీ వైన్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడి మద్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫయాజ్ మాట్లాడుతూ ప్రజలంతా క్యూఆర్ కోడ్ ను స్కానింగ్ చేయడం ద్వారా ఏది నకిలీ మద్యం, ఏది మంచి మద్యం అనే తేడాను గుర్తించాలని కోరారు. ఈ క్యూఆర్ కోడ్ విధానం ద్వారా నకిలీ మద్యం అమ్మకాలను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. క్యూఆర్ కోడ్ లేని లేదా నకిలీ మద్యం కనిపించిన వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని ఫయాజ్ తెలిపారు. అక్రమంగా తయారు చేసిన మద్యం సేవించడం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో పాటు ప్రాణాపాయాలు కూడా సంభవించే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. అలాగే, అనుమానాస్పద మద్యాన్ని నివారించడానికి ఉద్దేశించిన ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రతి ఒక్కరూ ఉపయోగించాలని ఎన్ఎండి ఫయాజ్ కోరారు. ప్రజలందరూ ఆరోగ్యంగా, భద్రంగా ఉండాలంటే ఈ యాప్‌ను తప్పకుండా వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గోస్పాడు మండల కన్వీనర్ తులసిశ్వర్ రెడ్డి, కేఎల్ దీపక్ రెడ్డి, సర్పంచ్ బాలన్న , రంగ శేఖర్ రెడ్డి, కామిని మల్లికార్జున , ప్రసాద్ రెడ్డి , మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ యువతకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రాష్ట్రంలో మైనార్టీ యువతకు జర్మనీలో ఉద్యోగావకాశాలను ప్రభుత్వం కల్పిస్తున్నట్లు మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఐఇఎస్ సహకారంతో జర్మనీలో ఎలక్ట్రిషియన్ ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండేళ్ల ఐటీఐ, మూడేళ్ల ఎలక్ట్రీషియన్ ట్రేడ్ విద్యార్హత కలిగి, వయోపరిమితి గరిష్టంగా 30 ఏళ్లలోపు ఉండి, ఎలక్ట్రిషియన్ పనుల్లో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్న అభ్యర్థులు జర్మనీలో ఉద్యోగాలకు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.2,600 నుంచి 2,700 యూరోలు (భారత కరెన్సీ ప్రకారం రూ.2.60 లక్షల నుంచి రూ.2.70 లక్షలు) పొందొచ్చన్నారు. అదనపు పనికి అదనపు జీతం, ఇతర సౌకర్యాలు లభిస్తాయని తెలిపారు. వసతి, అనువాద, స్థానిక గుర్తింపు ఖర్చులు యజమాని భరిస్తారని వెల్లడించారు. జర్మనీలో ఉద్యోగాలు పొందేందుకు అర్హులైన అభ్యర్థులకు జర్మనీ భాషపై పట్టు సాధించేందుకు వీలుగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 12 నుంచి 14 వారాల పాటు శిక్షణ తరగతులను తాత్కాలికంగా రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందుకు అయ్యే ఖర్చును అభ్యర్థులే భరించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు, శిక్షణ కోసం ఫీజు రూ.1.15 లక్షలను మూడు వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. విమాన, వీసా ఛార్జీలు అభ్యర్థులే స్వయంగా చెల్లించాలన్నారు. ఈ ఉద్యోగాల కోసం వచ్చే నెల 2వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు 9988853335, 8712655686, 879011834935 వివరాలు తెలుసుకోవచ్చని వెల్లడించారు.